క్లుప్తంగా

ఈద్గా వద్ద ఏర్పాట్ల పరిశీలన



ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్

నర్సాపూర్ రూరల్: రంజాన్ పండుగను పురస్కరించుకొని రుస్తుంపేటకు వెళ్లే దారిలో ఉన్న నమోజ్ గడ్డ వద్ద ఉన్న ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థన కోసం మున్సిపల్ సిబ్బంది బుధవారం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈద్గా వద్ద చేపడుతున్న పనులను నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ నయీం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ఈద్గా వద్దకు పెద్ద ఎత్తున మైనార్టీలతో పాటు ఆయా రాజకీయ నాయకుల పార్టీల ప్రముఖులు రాను నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు గులాం మహమ్మద్, ఇతర మైనార్టీ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్: ప్రజాపాలనకు ప్రజలు, ఇతర పార్టీల నాయకులు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి అన్నారు. బుధవారం ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి ఆధ్వర్యంలో నర్సాపూర్ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుహాసినిరెడ్డి, మల్లేశ్, శ్రీనివాస్‌గుప్తా, సురేశ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌జోన్: పట్టణంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లతో పాటు ముఖ్యనాయకులంతా కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సమక్షంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అశోక్, కౌన్సిలర్లు పార్టీ మారారు.

రావి ఆకుపై రంజాన్ చంద్రవంక



రావి ఆకుపై చంద్రవంక

మనోహరాబాద్(తూప్రాన్): రంజాన్ పండుగ సందర్భంగా మనోహరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు బ్రహ్మచారి రావి ఆకుపై చంద్రవంక, మజీద్‌ను అద్భుతంగా చిత్రికరించారు.

పంటను కాపాడేందుకు పాట్లు



పొలాలకు నీటిని మళ్లించేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు

కొల్చారం(నర్సాపూర్): మండుతున్న ఎండలతో చెరువులు కుంటలు, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఈ తరుణంలో బోర్ల కింద సాగు చేసిన పంటను కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. మండలంలోని రంగంపేట శివారులో వరి పంటను దక్కించుకునేందుకు స్థానిక కొత్తచెరువులోకి ఎత్తిపోతల ద్వారా నీటిని పంపింగ్ చేసి, అక్కడి నుంచి మోటార్ల ద్వారా పైప్ లైన్‌లతో చెక్ డ్యాంలోకి నీటిని చేరవేస్తున్నారు. చెక్ డ్యామ్‌లో చేరిన నీటిని మోటార్ల ద్వారా కిలో మీటర్ల కొద్దీ పైప్ లైన్లను ఉపయోగించి పొలాలకు నీటిని అందిస్తున్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న డాక్టర్ లింబాద్రి

రామాయంపేట(మెదక్): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు తాగునీటి వసతి కల్పించడానికి లయన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహబంధు ప్రతినిధులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈమేరకు బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి చలివేంద్రం ప్రారంభించారు. క్లబ్ జోన్ చైర్మన్ ఐరేని రవీందర్‌గౌడ్, కోశాధికారి గంగారాం, డీసీలు బాదె చంద్రం, దామోదర్‌రావు, శ్రీనివాసరావు, దీప్‌చంద్, ఇతర ప్రతినిధులు సతీశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన పల్లెలు



చిన్నశంకరంపేట(మెదక్): శేరిపల్లిలో బోనాలతో మహిళలు



కౌడిపల్లి(నర్సాపూర్): ముట్రాజ్‌పల్లిలో బోనాలతో భక్తులు



కౌడిపల్లి(నర్సాపూర్): వెంకట్రావ్‌పేటలో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): అజ్జమర్రిలో..



పెద్దశంకరంపేట(మెదక్): ఉత్తులూర్‌లో..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లిలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా రేణుకా మాతకు బుధవారం గ్రామస్తులు బోనం సమర్పించారు. అంతకు ముందు అమ్మ వారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం అమ్మవారి ఆలయం చుట్టూ బండ్లు తిప్పి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎర్ర పోచమ్మతల్లికి పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలోని ఎర్ర పోచమ్మతల్లికి గ్రామ మహిళలు బుధవారం ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ మహిళలు బోనాల ఊరేగింపును డప్పు చప్పుళ్లతో, పోతురాజుల విన్యాసాలతో, చిన్నారులు, యువకులు నృత్యాలతో ఘనంగా ఊరేగించి, అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తులూర్‌లో ..

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని ఉత్తులూర్ గ్రామంలో గ్రామదేవతలకు బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా శివసత్తుల నృత్యాలు, యువకుల కేరింతల మధ్య భాజాభజంత్రీలతో ఊరేగింపుగా మహిళలు తరలివెళ్లి గ్రామదేవతలకు బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను కమిటీ సభ్యులు అందంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఘనంగా బండ్ల ఊరేగింపు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని ముట్రాజ్‌పల్లి, వెంకట్రావ్‌పేట్, వెల్మకన్నె, కుకుట్లపల్లి తదితర గ్రామాల్లో గ్రామ దేవతల జాతర ఘనంగా జరుగుతుంది. బుధవారం గ్రామ దేవతలకు గ్రామస్తులు ఘనంగా బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఎదుట పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బోనాలతో పాటు ఎడ్ల బండ్లు ఊరేగించి, దేవతలకు ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నవీన్‌గుప్తా, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు సంజీవ్, నజియా ఉన్నీసా సలీం, రాజేందర్, సుజాత కాంతారావు, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో తాగునీటి సమస్య రానివ్వం

జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య

సాక్షి ఎఫెక్ట్..



తండాలో మాట్లాడుతున్న డీపీఓ యాదయ్య

టేక్మాల్(మెదక్): తండాల్లో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. ఈనెల 10న తండాలో తాగునీటి కష్టాలు అని 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మండలంలోని సర్మోనికుంటతండా పంచాయతీ పరిధిలోని బర్రెకంల్‌కుంట తండాలో బుధవారం తాగునీటి సమస్యను జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య పరిశీలించారు. తాగునీటి సమస్యను తీర్చేందుకు పైప్‌లైన్‌ను సరిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమగు చోట పంచాయతీ ట్యాకర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, విధులపై ఎవరు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఇందులో కార్యదర్శి రషీద్ తదితరులు ఉన్నారు.

రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెడితే చర్యలు



కొల్చారం(నర్సాపూర్): రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ



హవేళిఘణాపూర్(మెదక్): రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఆనంద్‌గౌడ్

కొల్చారం(నర్సాపూర్): రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పోతంశెట్టిపల్లి శివారులోని జాతీయ రహదారిపై దాన్యం ఆరబెట్టిన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టి ప్రమాదాలకు కారణం కావొద్దని చెప్పారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం, రాత్రులు ధాన్యం కుప్పలు కారణంగా గతంలో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలపాలై ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ప్రతీ రైతు ఇది గమనించాలన్నారు. మండలంలో అక్రమం మట్టి, ఇసుక రవాణా, పేకాట, నిబంధనలు విరుద్ధంగా బెల్ట్ షాపులు నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. మండలంలో ఎక్కడ ఇలాంటి కార్యకలాపాలు కొనసాగిన 100 నెంబర్‌కు కచ్చితమైన సమాచారంతో డయల్ చేయాలని ప్రజలను కోరారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసిన వారిపై చర్యలు తీసుకుంటామని నిజాంపేట ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరి, మొక్కజొన్న కోత దశకు వచ్చాయి. కావున రైతులు ధాన్యాన్ని రోడ్లపైన ఆరబోయ రాదని తెలిపారు. రోడ్డుపై ధాన్యం ఆరబోయడం వల్ల ప్రతీ ఏటా ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగి వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడం వల్ల వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. కావున రైతులు రోడ్డు ప్రమాదానికి గురికాకుండా ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టండని అన్నారు. రోడ్లపై ధాన్యం ఆరబెడితో ఆ యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

రైతులు సహకరించాలి

హవేళిఘణాపూర్(మెదక్): రైతులు రోడ్డుపై ధాన్యం వలన ప్రమాదాలు జరుగకుండా సహకరించాలని హవేళిఘణాపూర్ ఎస్ఐ ఆనంద్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రమైన హవేళిఘణాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో రోడ్డుపై పోసిన వరిధాన్యం రైతులతో మాట్లాడారు. రైతులు తాము పండించిన వరిధాన్యంను పంట పొలాల్లో, విశాలమైన ఉన్న స్థలాల్లో పోసుకోవాలన్నారు. వీలైనంత మేరకు రోడ్డుకు పక్కన వాహనాలు వెళ్లేందుకు వీలుగా పోసి రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏఎస్ఐ రాజు, రైతులు ఉన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలిక



పాపను తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు

రామాయంపేట(మెదక్): పట్టణంలో తప్పిపోయిన బాలికను పోలీసులు ఆమె తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. మండలంలోని శంఖాపూర్‌కు చెందిన గంగి సత్యం, కవిత దంపతులు తమ రెండేళ్ల కూతురుతో కలిసి బుధవారం రామాయంపేటలో జరిగిన సంతకు వచ్చారు. మార్కెట్‌లో పాప తప్పిపోగా, వారు గాలించినా ఆచూకీ లభించలేదు. మార్కెట్‌లో పాప తల్లిదండ్రులకోసం ఏడుస్తుండగా చూసిన కొందరు ఆమెను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వాట్సాప్ గ్రూపులో పాప వివరాలు రాగా తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్ చేరుకొని తమ కూతురును తీసుకెళ్లారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా



కల్యాణంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బుజ్రాన్‌పల్లి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయ ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు విశ్వనాథ్‌రావు, సుధాకర్‌రావు, విజయ్‌కుమార్, జగన్నాథ్‌రావు, అశోక్‌రావు, మాజీ సర్పంచ్ బూదెమ్మ, నాయకులు విఠల్, నారాయణ, కాశీనాథ్‌గౌడ్, మహిపాల్‌గౌడ్, జైపాల్‌గౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మకు ఎమ్మెల్యే సునీతారెడ్డి పూజలు



శివ్వంపేట(నర్సాపూర్): భక్తులతో కలిసి ఒగ్గుకథ వింటున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముట్రాజ్‌పల్లిలో గ్రామదేవతల జాతరలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో భాగంగా బుధవారం ముట్రాజ్‌పల్లిలో గ్రామ దేవతలు పోచమ్మ, దుర్గాదేవి, ముత్యాలమ్మకు గ్రామస్తులు బోనాలు తీసి, బండ్లను ఊరేగించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మి, గ్రామస్తులు సునీతారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామాగౌడ్, నాయకులు సత్యాగౌడ్, అమర్‌సింగ్, భిక్షపతి పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో మల్లన్న జాతర

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో మల్లన్నస్వామి జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, ఒగ్గుకథ నిర్వహించారు. భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు యాదగౌడ్, హన్మంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సింగరావ్, కాంతరావు, ఎల్లయ్య, శ్రీశైలంయాదవ్, బాబురావ్, లింగంయాదవ్ ఉన్నారు.

పంట దిగుబడిపై కోత ప్రయోగం



నూర్పిడి చేసిన ధాన్యం తూకం వేస్తున్న అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): వరి పంట దిగుబడిపై అంచనా వేసేందుకు జిల్లా ప్రణాళిక అధికారులు మండలంలోని బండపోసాన్‌పల్లిలో కోత ప్రయోగం చేశారు. గ్రామానికి చెందిన గాండ్ల సత్తయ్య వ్యవసాయ క్షేత్రంలో ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పుతో మొత్తం 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో వరి పంటను కోసి నూర్పిడి చేశారు. దీంతో 12.800 కిలోగ్రాములు దిగుబడి వచ్చిందని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మాన్య తెలిపారు. దీనిని బట్టి రైతుకు ఎకరాకు 20 నుంచి 22 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని గుర్తించామన్నారు. కార్యక్రమంలో డివిజనల్ ఉప గణాంక అధికారి శ్రీనివాస్, మండల ప్రణాళిక గణాంక అధికారిణి దివ్య భారతి తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ముందుకు వెళ్లాలి



నూతన గ్రామ అధ్యక్షుడిని సన్మానిస్తున్న జయరాములు

శివ్వంపేట(నర్సాపూర్): పద్మశాలీలు ఐకమత్యంగా ఉంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు జయరాములు అన్నారు. బుధవారం మండల పరిధిలోని దంతన్‌పల్లిలో పద్మశాలి గ్రామకమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జయరాములు మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి దుర్గం రమేశ్ ఉన్నారు.

గ్రామ శాఖ నూతన కమిటీ

గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా నాంచారి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా గడ్డం వెంకట్‌రాములు, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రవి, ఉపాధ్యాక్షుడిగా దుర్గం శివకుమార్, గజేంద్రుల శంకర్, ఎనగందుల రవి, గడ్డం నవీన్, సహాయ కార్యదర్శులుగా గడ్డం నాగభూషణం, దుర్గం ఆంజనేయులు, ప్రకాశ్, కోశాధికారిగా నాగరాజు, ప్రచార కార్యదర్శిగా ప్రవీణ్, ముఖ్య సలహాదారులుగా సత్యనారాయణ, వీరేశం, అంజయ్య, రవి నియమితులయ్యారు.

ఘనంగా కేదారేశ్వర ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): మండలంలోని నాగుసానిపల్లి గ్రామంలో ఉమా కేదారేశ్వర ఆలయ 41వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మాధవనాంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో భక్తులు శివుడికి పంచామృత అభిషేకం, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల భక్తులు, అర్చకులు రాజశేఖర్‌శర్మ, శ్యాంసుందర్‌శర్మ, చంద్రశేఖర్‌శర్మ, రాంశర్మ, సందీప్‌శర్మ, వంశీశర్మ, నర్సింలు గుప్తా, ఇంద్రసేనారెడ్డి, యాబన్నగుప్తా, ప్రసాద్, భుమయ్య, భూషణం, కావూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పాపన్నపేట(మెదక్): అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందిస్తున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

పాపన్నపేట(మెదక్): ఇటీవల నిర్వహించిన జిల్లా విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో మండల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ నాగస్సాన్‌పల్లి విద్యార్థులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అశోక్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులు విష్ణువర్ధన్, ఏలేందర్ చక్కని ప్రతిభ కనబర్చి నాలుగు అవార్డులు గెలుపొందారన్నారు. వీరికి బుధవారం మెదక్‌లో డీఈఓ రాధాకృష్ణన్ అవార్డులు అందజేశారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్: జిల్లా స్థాయి సైన్స్ పోటీల్లో గీతా పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారని పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిల్లో సైతం విద్యార్థులు హాజరై బహుమతులు పొందారు. వీరికి జిల్లా విద్యాధికారి రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మెమెంటోతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, చైర్ పర్సన్ ఉష, ప్రిన్సిపాల్ సీ.హెచ్. వెంకటకృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేంరాజ్, ఉపాధ్యాయులు సల్మా, హరికుమార్, సందీప్, కవిత, విజయన్, శ్రీనివాస్‌లు విద్యార్థులను అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ **బాధిత కుటుంబానికి యువత అండ**

తూప్రాన్: మండలంలోని ఆదర్శ గ్రామం మల్కాపూర్‌లో సక్సెస్ యూత్ సభ్యుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి అండగా నిలిచారు. బుధవారం యూత్ ఆధ్వర్యంలో ఆత్మహత్య చేసుకున్న రాజాగౌడ్ కుటుంబాన్ని పరామర్శించి,రూ. 20 వేల ఆర్థికసాయం అందజేశారు. యూత్ సభ్యులు పాల్గొన్నారు.

◆ **షాట్ సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధం**

చేగుంట(తూప్రాన్): షాట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి వస్తువులు దగ్ధమైన సంఘటన మండలంలోని వడియారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొడి నర్సింలు ఇంట్లో షాట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాయి. లక్షన్నర వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు రెవెన్యూ అధికారులకు తెలిపారు.

◆ **బీజేపీలో చేరికలు**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల బీజేపీ నాయకుడు మన్నె యాదగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు సమక్షంలో బుధవారం బీజేపీలో చేరారు. బీజేపీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, బీజేపీ నార్సింగి మండల నాయకులు నరేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఉన్నారు.

◆ **గుండెపోటుతో భుజిరంపేట మాజీ సర్పంచ్ అంజిరెడ్డి మృతి**



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట మాజీ సర్పంచ్ అంజిరెడ్డి(70) బుధవారం గుండె పోటుతో మృతి చెందాడు. బుధవారం ఉదయం నర్సాపూర్‌లోని కూతురు ఇంటికి వెళ్లగా అక్కడ గుండెపోటు రావడంతో చికిత్సకు తరలించగా ఆయన మృతి చెందాడు.

◆ **అంగన్‌వాడీలో రంజాన్ వేడుకలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని నాల్గవ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ముందస్తుగా రంజాన్ వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ రజియ సుల్తాన ఆధ్వర్యంలో కేంద్రంలో పిల్లలకు షీర్‌కుర్మ స్వీట్ పంపిణీ చేశారు.

◆ **లేజర్ ప్రింటర్ బహూకరణ**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఆగ్రహారం ప్రాథమిక పాఠశాలకు బెస్ట్ రన్నర్స్ అసోసియోషన్ ఆధ్వర్యంలో రూ.45 వేల విలువైన లేజర్ ప్రింటర్‌తో పాటు సౌండ్ సిస్టంను అందజేశారు. బుధవారం పాఠశాలలో హెచ్ఎం శివకుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా బెస్ట్ రన్నర్స్ సేవలను మండల నోడల్ అధికారి పుష్పవేణి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేకర్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **అల్లాదుర్గం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా రఘుపతి**



అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా గొండ రఘుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం అల్లాదుర్గం ఎల్లమ్మ ఆలయం వద్ద ఎన్నికలు నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా గొండ రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా వీరేందర్, రమేశ్, కార్యదర్శిగా పాపయ్య చారి, కోశాధికారిగా వెంకట్‌రామ్, సలహాదారుడిగా కుమార్, కార్యవర్గ సభ్యులుగా సాయిలు, నరేశ్, శేఖర్, వెంకట్, రాజు, నర్సింలు, శంకర్, రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రఘుపతి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల సాధన కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులకు డబుల్ బెడ్రూంలు, ఇళ్లస్థలాల మంజూరు కోసం పాటుపడతానని చెప్పారు. సమస్యల సాధన కోసం అందరి సహకారంతో పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

◆ **బీజేపీ ఇంటింటి ప్రచారం**

అల్లాదుర్గం(మెదక్): జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను గెలిపించాలని బీజేపీ మండల నాయకులు చెవెళ్ల గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. దేశ అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులు రాములు, సాయిలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.